
# సంసారంలో హింసావాదం

ఆదుర్తి
వెంకట సీతారామ మూర్తి



"జానకీ!"

**అది పిలుపులా లేదు - తాతలనాటి కంచు కంచం అటకమీద నుంచి కింద పడి బద్దలయినట్టుంది జానకి ప్రాణానికి.**

'కంధిపప్పు ధర ఎలాగూ అందుబాటులో లేదు. ఈ పప్పు డబ్బాకూడా నాకు అందకుండా పోవాలా?' అనుకుంటూ పై అలమరలో ఉన్న డబ్బా కోసం కాలి ముని వేళ్లమీద నిలుచుని చేతి వేళ్లతో నెమ్మదిగా పప్పు డబ్బాని జరుపుకొస్తున్న జానకికి, అదే పిలుపు మరోమారు అంతే ఉధృతంతో వినపడడంతో, తన ప్రయత్నానికి స్వస్తి చెప్పి ముందు గదిలోకి పరుగు లాంటి నడకతో వెళ్లింది, "ఏవిటటా పొద్దున్నే?" అంటూను.

"నా పర్సులోని యాభై రూపాయల నోటు గాని తీశావా?" చిందులు తొక్కుతూ అడిగాడు రామచంద్రం.

"ఇంతేనా? ఇంకేదో అయిపోయిందని హడలి చచ్చాను" అంది తాపీగా.

"ఇంతకీ తీశావా, లేదా?"

"తీశాను, పొద్దున్నే కూరల వా డొస్తేనూ ..."

"చంపేశావు పో! అసలే నెలాఖరు. జేబులో ఉన్న ఆఖరినోటు కాస్తా నువ్వు మార్చేస్తే, నే నివాళ మోపెడ్‌లో పెట్రోలు పోయించుకోవడం ఎలాగ? ఆఫీసు కెళ్లడం ఎలాగ? నిన్ననే పెట్రోలు రిజర్వులో కొచ్చింది" అంటూ గాలి తీసిన బెలూన్‌లా ఈజీ ఛెయిర్‌లో కూలబడ్డాడు రామచంద్రం.

"ఆ సంగతి నా కేం తెలుసు, మీ దగ్గర ఇంకా ఉన్నా యనుకున్నాను" అంది జానకి అమాయకంగా ముఖం పెడుతూ.

"బాగానే ఉంది సంబడం. నా కొచ్చే జీతానికి పర్సు కాక, బాంకులో వేరే లాకరు కూడా మెయిన్‌టైన్ చేస్తున్నా ననుకున్నావా? అయినా నిన్ను అనుకు నేం లాభం? ఆ మోపెడ్ కొన్న దగ్గర నుంచీ ఖర్చు తడిసి మోపె డవుతూనే ఉంది. ఎప్పుడు పెట్రోలు పోయించాలన్నా గండమే. ఏ ముహూర్తాన కొన్నానో గానీ, కొన్న కొద్ది నెలలకే పెట్రోలు ధర రెట్టింపై పోయింది!"

"సర్లెండి, ఇంకెప్పుడూ మిమ్మల్ని అడక్కుండా తియ్యను" అని, "ఇంతకూ పెట్రోలు సంగతేం చేయదలచుకున్నారూ?" అనడిగింది.

"ఏముందీ, ఆదిలో వాల్మీకి చేసిన పనే."

"అంటే ...?" అర్థం కానట్టు చూసింది జానకి.

"అదేనోయ్, దారి కాయడ మన్నమాట! ఈ నాలుగు రోజులూ దారి కాసి ఆఫీసు కెళ్తున్న వా రెవరి బండి వెనకో ఎక్కేయడమే."

"ఛ! అదేం బాగు?"

"అదే బాగు. వెనకటికి వాహనమూర్తి అని బెజవాడ బ్రాంచిలో మాతో పని చేసే వాడు ..."

"వాహనమూర్తా? అ దేం పేరు?" మధ్యలోనే అడ్డొచ్చింది జానకి.

"అసలు పేరు వామన మూర్తిలే. మా వాళ్లు పెట్టిన ముద్దుపేరు వాహనమూర్తి. రోజూ వాళ్లింటి దగ్గరలో ఉన్న జంక్షన్‌లో కాసి మా మేనేజర్ గారి కారు దగ్గరనుంచి మా ప్యూన్ సైకిల్ వరకూ ఏ వాహన మొచ్చినా, మొహమాట పడకుండా ఆపేసి ఎక్కేయడమే అతని హాబీ. సొంత డబ్బుతో బస్సెక్కి ఆఫీసు కెళ్లకూడదని అతని అభిప్రాయ మేమో మరి! ఇటువంటి నెలాఖరి కష్టకాలంలో అతనే నాకు మార్గదర్శి!!" అన్నాడు రామచంద్రం నవ్వుతూ.

* * *

"ఇదిగో, జానకీ! మళ్లీ నేను చెప్పలే దనకు - ఇక మీదట నెల జీతం చాలా పొదుపుగా వాడుకోవాలి!" జీతాలనాడు భార్యకు ఇంటి ఖర్చుల కోసం డబ్బు ఇస్తూ అన్నాడు రామచంద్రం.

"నేను కాపురాని కొచ్చింది మొదలు మీ నోటి నుంచి ఇదే మాట వింటున్నాను. నా కిదేం కొత్తా? అలాగే లెండి!" అంది జానకి.



"అది కాదు, జానకీ! నీకు తెలియం దేముంది - వచ్చే నెలలో రవి హాస్టల్ ఫీజు పంపాలా? మరి నాలుగైదు నెలల్లో రమను కాలేజీలో జేర్పించాలి కదా! కాలేజీ ఫీజులూ, డొనేషన్లూ, డ్రెస్సులూ, పుస్తకాలూ - వీటన్నిటికీ కావాలి కదా! వచ్చేది ఒక్క జీతం."

"ఇవన్నీ జీతంలోనే అంటే కష్టమే. అటువంటి వాటికి ఏ ప్రావిడెంట్ ఫండు అడ్వాన్సో పెట్టాలి మరి!' ' అంది జానకి తెలివిగా.

"అ దేం ఊట బావా ఏమిటి, తోడుతున్న కొద్దీ ఊరడానికి. ఆ మధ్య మీ చిన్న చెల్లి పెళ్లికి హైదరాబాద్ వెళ్లినప్పుడు పెట్టేశానుగా! మన ఖర్చులూ, ప్రెజంటేషనూ కలిపి పదిహేను వందలకు పైనే అయింది. మిగిలింది చిల్లర అప్పులు తీర్చడానికీ, స్కూలు ఫీజులకీ, ప్రైవేటు ఫీజులకీ సరిపోయింది."

"అయితే ఇంతకీ ఏమంటారూ?"

"ఆ అడ్వాన్సు తాలూకా కోత వల్లే జీతం తక్కువొస్తోంది. మళ్లీ అప్పు చేసే వరకూ పొదుపుగా వాడమని మొర పెట్టుకుంటున్నాను" అన్నాడు రామచంద్రం.

"సర్లెండి, ఈ మారు లోను పెట్టినప్పుడు రమకి మెళ్లోకి గొలుసు చేయిస్తే గాని ఊరుకునేది లేదు. ఎదుగుతూన్న పిల్ల - ఆ మాత్రం బంగార ప్పిసరు ఒంటిమీద లేకపోతే బాగుండదు!" అంటూ లేచి, ముందుకు పడిన వాల్జడను విసురుగా వెనక్కు విసిరి, లోపలకు వెళ్లిపోయింది జానకి.

అటువంటి సమయాల్లో ఆమె కెలా చెప్పాలో అర్థం కాదు రామచంద్రానికి. జానకికి అన్నీ తెలుసు. కానీ మధ్య తరగతి బతుకైపోయిందే అన్న చిరాకు. ఇంకా ఏమైనా అంటే "సంపాదనకు సరిపోయేట్టు ఖర్చులు కుదించుకోవడం కాదు, ఖర్చునుబట్టి సంపాదనను పెంచుకోవాలి!" అంటుంది.

* * *

ఆఫీసు నుంచి ఇంటి కొచ్చిన రామచంద్రానికి కాఫీ కప్పు నందిస్తూ చెప్పింది జానకి -

"మా కాంతి పిన్ని మూడో కూతురు రాజ్యం వాళ్లూ లేరూ, బొలంగీర్‌లో ఉంటారు."

"ఉంటే ...?"

"వాళ్లు మనింటికి వస్తున్నారండీ! ఉత్తరం రాసింది."

"ఏవిఁటీ విశేషం? ఇక్క డేమైనా పెళ్లా?"

"పెళ్లిళ్లకే గాని రాకూడదా ఏవిఁటి? మనింటికే - మనని చూడ్డానికే వస్తున్నారు" అంటూ ఉత్తరం అందించబోతూ, "ఏవిఁటీ ... మొహం అలా పెట్టేశారూ?" అంది.

"ఏం లేదులే!" అంటూ ఓ బరువైన నవ్వు నవ్వి ఊరుకున్నాడు.

"మీ నవ్వును అర్థం చేసుకోలేనంత తెలివి తక్కువ దా న్నేం కాను లెండి! మా వాళ్లొస్తే మీకు ఖర్చు. అంతేగా? తల్లీ తోడూ అన్నాక రాకుండా ఉంటారా? ఉండ కుండా ఉంటారా?"

జానకికి కోపం ముంచు కొస్తున్నట్లు గ్రహించాడు రామచంద్రం. ఆమెకు కోపం వస్తే ఏం జరుగుతుందో అతనికి తెలుసు. అందుకే -

"ఇంతకీ ఉత్తరం రాసిం దెవరటా?" అంటూ విషయం మార్చాడు.

"ఇం కెవరు? చెల్లాయే!" అంది జానకి

"కుటుంబ సమేతంగా వస్తున్నప్పుడు పోనీ ఆ ఉత్తర మేదో ఆయనగారు ... అదే ... మీ మరిది నాకే రాయొచ్చుగా?"

ఈ బాణానికి జానకి కాస్త చల్లబడింది. "పోన్లెండి, ఎన్నేళ్లకో వాళ్లు మనింటి కొస్తున్నారు. నాలుగు రోజులుండి వెళ్తారు. ఇందులో తప్పు పట్టుకోడాని కేం ఉందీ?" అంది.

"అవు నవును, అంతేలే!" అంటూ లోపలి కెళ్లిపోయాడు రామచంద్రం.

రెండు రోజుల తర్వాత సాయంకాలం ఆఫీసు నుండి వచ్చి గుమ్మంలో కాలు పెడుతూనే ఆశ్చర్యపోయాడు రామచంద్రం. ఇల్లు, వాకిలీ శుభ్రంగా ముగ్గులతో నిండి ఉన్నాయి. గుమ్మాలకీ, కిటికీలకీ ఇస్త్రీ మడతల కర్టెన్లు వేలాడుతున్నాయి. డ్రాయింగ్


మా నూతన మెగా షోరూమ్ ప్రారంభమైన సందర్భమున దీపావళి కానుక

స్పెషల్ ఆఫర్: కెంపులు, పచ్చలు K.D.M. బంగారు ఆభరణములపై ప్రత్యేక తగ్గింపు కలదు



గొప్ప అవకాశం: 12.10.97 నుండి 3.11.97 వరకు 10,000రూ.లు పైన బంగారు ఆభరణములు కొన్నవారికి CMR డిస్కౌంట్ కార్డు పొందవచ్చును. ఈ కార్డుపై మీరు బంగారం కొన్నరోజునుంచి 60 రోజులలోపు రాళ్ళు, తరుగులు, కూలీలు లేకుండా మరొకసారి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చును.



సి. మోహన్‌రెడ్డి

CMR

మోహన్‌రెడ్డి జ్యూయలర్స్

A/c

కాకర్లవారివీధి, చిన్నబజార్, నెల్లూరు. Ph: 327549 (S), 327650 (R)



సి. భాస్కర్‌రెడ్డి

M.B.B.S., M.S. (FRCS)

GEN. SURGERY



## భూకంపాల అలారం

భూకంపం వచ్చేముందు భూమిలోపల అనేక మార్పులు జరుగుతాయి. ఆ మార్పులు, శబ్దాలు గ్రహించి ప్రజలను అప్రమత్తుల్ని చేసే పరికరాన్ని ఇజ్రేల్ భూగర్భ శాస్త్ర పరిశోధకులు తయారుచేశారు. ఇది భూకంపం రావడానికి **45** క్షణాలముందే అలారం మోగించి, ఫ్లాష్ లైట్లు వెలిగించి ఆ ప్రదేశాన్నుండి మనుషులు తప్పించుకునే వీలు కల్పిస్తుంది.

రూమ్ అనబడే ముందు గదిలో మేజా బల్లమీద అందంగా ఫ్లవర్ వాజ్‌లో పువ్వులు అలంకరించి ఉన్నాయి. విషయం అర్థమైంది.

"ఎవరు సర్దారో గానీ, ఇల్లు చాలా చక్కగా, నీటుగా సర్దారు!" అన్నాడు జానకి చేతిలోని కాఫీ కప్పు అందుకుంటూ.

"బాగానే ఉంది...మన ఇల్లు ఇంకెవరో ఎందుకు సర్దుతారు? నేనే సర్దాను" అంది జానకి మెప్పుకోలుకు ఆనందపడిపోతూ.

"మూడు నెలల తర్వాత ఇవాళ ఊరంతా కూడా శుభ్రం చేశారు సుమీ! రోడ్లంతా అద్దంలా తుడిచి చెత్తంతా లారీల్లో తీసుకుపోయారు. మనలో వాడే, మనం ఎన్నుకున్నవాడే అయినా పై ఊరి నుంచి వస్తున్నాడుగా! ఆ మంత్రి పుంగవుడి కోసం ఆ షోకంతా. ఇంతమందిమి ఉన్నా, మనకి మాత్రం ఆ శుచీ శుభ్రతా అక్కర్లేదు" అన్నాడు రామచంద్రం.

జానకి కేదో లీలగా అర్థమైంది."ఆ నెపం మీ దేం నన్ను ఎగతాళి చెయ్య నక్కర్లేదు. రోజా మనం ఎలా ఉంటున్నా, కొత్తవా ళ్లొస్తుంటే ఇల్లూ, వాకిలీ సర్దుకోకపోతే ఏం బాగుంటుంది?" అంటూ కోపంతో చెంపలు ఎర్రబారుతుండగా వంటింట్లోకి వెళ్లిపోయింది.

"విషయం చెప్పాను. ఆ మాత్రం దానికే కోప మొచ్చేస్తే ఎలా? ఇంతకీ మీ వాళ్లు ఎప్పు డొస్తున్నా రంటావు?" అంటూ వంటింట్లోకి నడిచాడు.

"ఎప్పుడో ఏమిటీ, రేపేగా!" అంది జానకి కాస్త తగ్గి.

వంటిల్లంతా తెప్పించిన కిరాణా సామాన్ల పొట్లాలతో నిండి ఉంది. రామచంద్రం ఏదో అనబోయి, ఊరుకుని ఇవతలికి వచ్చేశాడు.

రాత్రి భోజనం అయ్యాక పక్క దులుపుతూ ఏదో గుర్తు వచ్చిన దానిలా "అన్నట్టు ... మీరు ఓ రెండ్రోజులైనా సెలవు పెట్టాలండీ!" అంది.

"ఎందుకూ? అప్పడాలు గానీ వత్తాలా?"

"ఏం కాదు, వాళ్లు ఈ ప్రాంతం ఎప్పుడూ రాలేదు కదా! ఇక్కడా, ఈ చుట్టుపక్కలా చూడాల్సినవి చూపించొద్దూ? ఒకరోజు సింహాచలం కూడా వెళ్లాలని రాసిందండీ!"

"ఇక నేం - ముందుగానే అన్నీ ఫిక్స్ చేసుకుని మరీ వస్తున్నా రన్నమాట. మంచిదే. ఒక్క సింహాచలమే ఏమిటి? సాగర దుర్గ, కైలాస గిరి, పోర్టు, షిప్ యార్డు, బీచీ, భీమిలీ ... ఇవన్నీ కూడా చూడొద్దూ?"

"ఇంతకీ సెలవు పెడతారు కదా!"

"అది మాత్రం నా చేతిలో లేదు, జానకీ! అవతల మా జోనల్ మేనేజర్ కేంపు కూడా ఉంది" అన్నాడు.

"ఏమో, నా కవేం తెలియవు. మీరు సెలవు పెట్టాల్సిందే!"

"చూద్దాంలే."

* * *

రెండు సూట్‌కేసులూ, రెండు ఎయిర్ బాగ్‌లతో ఆటో దిగారు రాజ్యం, సుందర్రావూ. సరిగ్గా ఆ సమయంలో వీధి గుమ్మంలోనే కూర్చుని ఉన్నారు జానకీ, రామచంద్రం.

"రండి రండి! రావే, రాజ్యం!" అంటూ సాదరంగా వాళ్లిద్దర్నీ ఆహ్వానించింది జానకి. ఆమె ఆనందానికి అంతు లేదు.

"ఇన్నాళ్లకి మా చెల్లాయిని మా ఇంటికి తీసుకొచ్చారు మరిదిగారు" అంది సుందర్రావుతో.

అతను నవ్వి ఊరుకున్నాడు కానీ మాట్లాడలేదు.

"వీడే నేమిటే నీ సుపుత్రుడూ! మూడో నెలలో అనుకుంటా వీడిని చూశాను. ఇప్పుడు మూడే ళ్లుండవూ?" అంది జానకి రాజ్యం పక్కనే బాల వీరుడిలా నిల్చుని ఇల్లంతా కళ్లతోనే అంచనా వేస్తున్న రాజ్యం కొడుకును చూసి.

"అవును. మూడు వెళ్లాయి. ఇప్పుడు నాలుగు నడుస్తోంది" అంది రాజ్యం.

"ఇక నేం, బళ్లో కెళ్లే వయసొచ్చేసిం దన్నమాట!"

"ఏం బడో, ఏం చదువో? చిన్న క్లాసులకి కూడా వేలకు వేలు పొయ్యాల్సి వస్తోంది. ఎ.బి.సి.డి. అనే నాలు గక్షరాలు వచ్చేసరికి నాలుగు వే లయిపోతోంది' ' అంది రాజ్యం.

"నయమే, బి.ఇ. అనే రెండక్షరాలు సం పాదించడానికి రెండు లక్షలయిపోతోంది మరి!" అన్నాడు రామచంద్రం.

"బావగారు మంచి జోకే వేశారు!" అంటూ నవ్వి, "ఇంతకీ నీ పిల్ల లేరే, అక్కా!" అనడిగింది రాజ్యం.

"సెలవులకి వాళ్ల తాతగారొచ్చి తీసుకెళ్లారు" చెప్పింది జానకి.

* * *

"ఇల్లంతా ఇంత నిశ్శబ్దంగా ఉందీ, కొంపదీసి మీ చుట్టాలు గాని వెళ్లిపోయా రేమిటి, జానకీ!" అన్నాడు రామచంద్రం ఆఫీసు నుంచి వస్తూనే.

జానకి ముఖం చిన్నబుచ్చుకుని, "బావుంది, అప్పుడే? రెండు రోజులేగా అయిందీ! అయినా, చుట్టా లేమిటి చుట్టాలూ? అది నా చెల్లెలు. అలా బీచికి వెళ్లొస్తా మని వెళ్లారు" అంటూ కాఫీ అందించి, "ఇదయ్యాక మీరు నా కో పని చేసి పెట్టాలి" అంది శాంతంగా.

"ఏమిటో అది? పచ్చడి గాని రుబ్బిపెట్టాలా?"

"అది కాదండీ, మా రాజ్యం కొడుక్కి పాలు తాగేటప్పుడు బిస్కెట్లు పాలలో ముంచుకు తినే అలవాటుందిట. అవి లేవని పాలు ముట్టడంలేదు వాడు భడవకానా! ఓ నాలుగు బిస్కెట్ పాకెట్లు తెచ్చి పడేశారంటే ..."

ముందు ఖంగుతిన్నాడు రామచంద్రం. ఆ వెంటనే నిలదొక్కుకుని, "ఎందుకు తేనూ? మా చక్కా కొని తెస్తాను. ఇంకా ఏం కావాలో అన్నీ ఒక్కసారే చెబితే ..." అన్నాడు కాస్త వ్యంగ్యాన్ని మాటల్లో కలిపి.

"పడుకోబోయే ముందు ఏదైనా పండు తిని పడుకోవడం అలవాటు చేసిం దది. ఓ డజను అరటి పళ్లో, కమలాలో తెచ్చేశారంటే నా ట్రోజు లుంటాయి. మన మెలాగూ ఆపిల్స్ కొనివ్వలేం కదా!"

"అవు నవును. పళ్లు తినడం వాడి ఆరోగ్యానికి మంచిదే. అన్నట్టు ... మీ చెల్లెలి మొగుడు ఏ బ్రాండు సిగరెట్లు కాలుస్తా డంటావ్?" వ్యంగ్యంలో కాస్త హేళన కూడా మిళాయించాడు రామచంద్రం.

"ఛ! అతను ఇంట్లో సిగరెట్లు కాల్చడండీ! ఎప్పుడైనా బుద్ధి పుడితే ఒకటో, అరో పైకి పోయి కాల్చుకొస్తాడట" అంది జానకి మామూలు ధోరణిలోనే.

"బతికించావ్!" అంటూ లేచి చెప్పుల స్టాండు దగ్గరకు నడిచాడు రామచంద్రం. అక్కడ అతనికి కావల్సిన వేవో కనిపించలేదు.

"అవునూ, నా చెప్పు లేవీ?" గావు కేక పెట్టాడు.

'ఇప్పుడా చెప్పు లెందుకూ, బూట్లేసుకు వెళ్దురూ!' అంది జానకి లోపలినుంచే.

"ఇప్పుడేగా బూట్లలో నుంచి పాదాలు బయటకు తీశాను! ఇంతకీ నా చెప్పు లేమైపోయాయో చెప్పవేం? కొంపదీసి ఏ కుక్కయినా ఎత్తు కెళ్లిం దేమిటి?" అన్నాడు.

"కుక్కా కాదు, నక్కా కాదు...మా చెల్లెలి మొగుడు వేసుకెళ్లాడు. అతని చెప్పేదో తెగిందట" అంది జానకి నెమ్మదిగా.

"అందుకని ... నా కొత్త చెప్పు లేసుకుని బీచికి వెళ్లాడా?" రామచంద్రానికి కోపం తారస్థాయిలో వచ్చేసింది.

"నోరు తెరిచి అడిగితే ఎలా కాదనగలను చెప్పండి? అప్పటికీ మా రాజ్యం మొహమాటపడుతూనే

అడిగింది."

జానకి ముఖంచూసి మ రేం మాట్లాడ లేకపోయాడు రామచంద్రం. బాత్రూం చెప్పు లేసుకునే నడిచాడు.

✵ ✵ ✵

"వడ్డించేశాను, వచ్చేయండి!" వంటింట్లోనుంచి జానకి కేక వేసింది. అప్పటికే సుందర్రావూ, రాజ్యం వంటింట్లోకి జేరినట్టు గ్రహించాడు రామచంద్రం. చదువుతున్న పుస్తకం అక్కడ పడేసి బట్టలు మార్చుకుని లుంగీ చుట్టుకుంటూ ఉండగా వీధి గుమ్మంలో అలికిడైంది - ఎదురింటి రంగారావు. అర క్షణంలోనే అంతా గ్రహించేసి, "భోజనానికి లేస్తున్నట్లున్నారు, కానివ్వండి. తర్వాత వస్తా!" అంటూ లోపలికి చూసి, "ఎవరూ చుట్టాలొచ్చినట్లున్నారూ?" అడిగాడాయన.

ఈలోగా లోపల నుంచి జానకి రానే వచ్చింది.

"మా పిన్ని కూతురూ వాళ్లూ వచ్చారండీ!" అంది నవ్వు ముఖంతో.

"అలాగా. సంతోషం. మీరు భోజనానికి వెళ్లండి. నేను కాస్సేపు కూర్చుంటాను" అంటూ గదిలోకి చొరవగా వచ్చాడు. ముందు గదిలో బుద్ధిగా మఠం ఏసుకుని టీవీ చూస్తున్న రాజ్యం కొడుకు అతని కళ్ల బడ్డాడు.

"ఈ అబ్బా యెవరూ ... మీ వాళ్లబ్బాయా?" అనడిగాడు జానకి వంక చూసి.

"అవునండీ!"

"బాపు గారి బుడుగులా ఉన్నాడు" అంటూ వాడి పక్కనే బైఠాయించి, "ఏం పేరు నాయనా, నీది?" అనడిగాడు.

వాడు మాట్లాడలేదు. కనీసం తల తిప్పి అయినా చూడలేదు.

"చెప్పు, నాయనా! నీ కేదైనా పేరుందా అని అడుగుతున్నారు" అన్నాడు రామచంద్రం.

"వాడు టీవీ చూస్తున్నప్పుడు బ్రహ్మదేవుడొచ్చినా మాట్లాడ్డు!" అంది జానకి.

"ఓహో, అదా సంగతీ! మంచిదే. ఇంతకీ ఆ కుర్రాడి చేతిలో ఆ రా యేమిటి?" అడిగాడు రంగారావు.

"దాని గురించి మాత్రం అడక్కండి" అన్నాడు రామచంద్రం.

పని ఉన్నదానిలా లోపలికి వెళ్లిపోయింది జానకి.

"ఏమో, ఏదైనా రహస్యమా?"

"మా టీవీ నాలుగు రోజు లుండాలంటే రహస్యమే మరి!"

'అదేవిఁటండీ?' అన్నట్టు చూశాడు రంగారావు.

"ఆ అబ్బాయి టీవీ చూస్తున్నప్పుడు ఆ టీవీ ఆపేసినా, వాడి గురించి మాట్లాడినా ఆ రాయి లేదూ ..."

"ఆఁ దా న్నుచ్చుకుని కొట్టేస్తాడా?"

"మనిషిని కాదు, ఆ టీవీని బద్దలు కొట్టేస్తాడు!' అన్నాడు రామచంద్రం.



రంగారావు గుండెలమీద చెయ్యేసుకుని వెనక్కు వాలి, "హారి వీడిబండ బడా! కష్టమే!' అన్నాడు.

"కష్టమే అని నెమ్మదిగా అంటా రేమిటీ? 'కీ' మని దూరదర్శన్ కేంద్రం ఓపెనయిం దగ్గర నుంచీ, 'బుస్' మని ప్రసారాలు అయిపోయే వరకూ, లేదా వాడికి నిద్ర వచ్చే వరకూ ఆ టీవీ అలా ఆన్ అయి ఉండాల్సిందే!" అన్నాడు రామచంద్రం గొంతు తగ్గించి.

"ఎలా భరాయిస్తున్నారండీ బాబూ, ఈ పిల్ల రాక్షసుడిని?" అంటూ లేచి, ఈ వారం వీక్లీ ఓ మారిచ్చారంటే సీరియల్ చది విచ్చేస్తాను" అన్నాడు రంగారావు.

"సాయంకాలమే వచ్చింది. ఇంకా చూడలేదు. అయినా, తీసుకెళ్లండి!" అంటూ వీక్లీ అతని చేతి కిచ్చి వీధి తలుపు వేశాడు రామచంద్రం.

✵ ✵ ✵

క్రమంగా సాయంకాలాలు ఆఫీసు నుండి త్వరగా రావడం మానుకున్నాడు రామచంద్రం. పార్కుకో, ఎగ్జిబిషన్‌కో, బీచికో - ఇలా ఎక్కడికో అక్కడికి తీసుకెళ్లమని రోజూ ప్రపోజలు ఉంటోంది మరి! నెమ్మదిగా ఏడు గంటలకు ఇల్లు చేరిన రామచంద్రానికి


MRIGNAYANI

దీపావళి ప్రత్యేక 20% డిస్కౌంటు

చందేరి శిల్క్ & కాటన్ శారీస్, కోసా శిల్క్స్ & డ్రెస్ మెటీరియల్స్ మహేశ్వరి శిల్క్ శారీస్, బాఫ్తా శారీస్, కాటన్ ప్రింటెడ్ శారీస్, హేండ్లూమ్ లేడీస్ డ్రెస్ మెటీరియల్స్, బెడ్‌షీట్స్ & ఫర్నిషింగ్స్.



విచ్చేయండి:
మృగ్‌నయని
ఎం.పి. స్టేట్ ఎంపోరియం
చేనేత భవన్, లతా థియేటర్ ఎదుట,
నాంపల్లి, హైదరాబాద్. ఫోన్: 4603372



కె.బి.ఆర్. కన్‌స్ట్రక్షన్స్

16–3–514, బైపాస్‌రోడ్, రామమూర్తి నగర్,
నెల్లూరు. ఫోన్ నెం. 321995

మీరు స్వంత ఇల్లు లేదని బాధపడుతున్నారా?
అయితే మీకో శుభవార్త!

K.B.R. వారి గృహవసతి పథకం ఫేస్–II

నెల్లూరు పట్టణమునకు అతి దగ్గర్లో నెల్లూరు బిట్-I, కొత్తూరు కరెంట్ ఆఫీసు ఎదురుగా ఉన్న 'కావేరినగర్' నందు 7 అం||లు|| (సింగిల్ బెడ్ రూం), 10 అం||లు|| (డబుల్ బెడ్ రూం)గల ప్లాట్లును దీర్ఘకాలిక ఋణ ప్రాతిపదికపై మీ సొంత ఇల్లు కట్టి ఇవ్వబడును.

| | |
|---|---|
| 7 అం|| సింగిల్ బెడ్ రూం ఖరీదు | రూ. 1,05,000/– |
| ఋణ సదుపాయం | రూ. 1,00,000/– |
| 10 అం|| డబుల్ బెడ్ రూం ఖరీదు | రూ. 1,50,000/– |
| ఋణ సదుపాయం | రూ. 1,50,000/– |

వైద్యశాస్త్రం ఎంత అభివృద్ధి చెందుతున్నా, ఆపరేషన్‌లు కొన్ని ఫెయిల్ అవుతూనే ఉన్నాయి. అందువల్ల ఆపరేషన్ లేకుండా చేసే వైద్య పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అలాంటి వైద్యాలలో 'పాంట్ థెరపి' ఒకటి. బ్లడ్ ప్రెషర్ చూసేటప్పుడు చేతికి కట్టే పట్టీలా బిగుతుగా ఉండే పట్టీలాగే ఈ పాంట్ ఉంటుంది. కాళ్లకు, పిరుదులకు, నడుమును బిగించే ఈ పాంట్ రోగికి 36 గంటలు వేసి ఉంచాలి. రక్త ప్రసరణ మీద ప్రభావం చూపించే ఈ పాంట్ థెరపి మూలంగా బైపాస్ సర్జరీ లేకుండా నయం చేయవచ్చు అంటున్నారు అమెరికా వైద్యులు.

- కృత్తిక

ఇల్లంతా నిశ్శబ్దంగా అనిపించింది.

అలస్యానికి కారణా లడుగుతూనే కాఫీ అందించింది జానకి. వాటికి ఇష్టమొచ్చిన సమాధానా లేవో చెప్పేసి, "ఇంతకీ మీ వాళ్లు ఏ సినిమాకి వెళ్లారంటావు?" అనడిగాడు.

ఆ ప్రశ్నలో ఏదో దెప్పికోలు, హేళన కనిపించింది జానకికి.

"ఏమో, మా రాజ్యానికి లేదు గానీ, అతనికి సినిమా పిచ్చి ఎక్కువే!" అంది.

"అవు నవును, మన బంగారమెప్పుడూ మంచిదే.'

"అది కాదులెండి. అతను కాస్త జల్సారాయుడే. పైగా పట్నం వచ్చాడు. పెళ్లాన్ని ఆ మాత్రం బయట తిప్పకపోతే బాగుండదనీ ..."

"అవు నవును. ఎందుకు బావుంటుందీ? బాగూ ఓగూ బాగా తెల్సినవాడు కదా! సినిమా చూడాలని అతగాడు ప్రపోజల్ పెట్టిన్నాడూ ఖర్చు మనమే భరించాలి. మనం తీసుకెళ్లినప్పుడూ మనమే భరించాలి. వాళ్లు అనుకున్నప్పుడు మాత్రం వా ళ్లొక్కళ్లే చూసి వచ్చేస్తారు" అన్నాడు రామచంద్రం ఈ మధ్య జరిగిన సంఘటనలు గుర్తు తెచ్చుకుని.

"పోనిద్దురూ! ఏదో కుర్రతనం! ఖర్చు మనిషే గానీ, డబ్బుకు చూసుకునే మనిషిలా కనిపించడు. అన్నట్టు ఇవాళో, రేపో వెళ్లిపోతాడట."

"ఏవిఁటీ? అత నొక్కడే! మరి రాజ్యం?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆఫీసు పనిమీద ఏదో ఊరెళ్లాలిట. తిరిగొచ్చి తీసుకెళ్తాడట" అంటూ గొంతు స్థాయి తగ్గించి, "మీరో చిన్న సాయం చేయాలిట" అంది.

ఏమిటన్నట్టు చూశాడు రామచంద్రం.

"ఓ అయిదొందలు అప్పుగా కావాలిట. అనుకోని ఖర్చేదో తగిలిందట. తిరిగొచ్చి తీర్చేస్తాడట. మిమ్మల్ని అడగడానికి మొహమాట పడి రాజ్యంచేత అడిగించాడు" అంది జానకి.

రామచంద్రం ముఖం అదోలా పెట్టడం చూసి, "ఎలాగో చూడండి. లేదంటే ఆ మాత్రం లేకుండా పోయాయా అనుకోవచ్చు. వాళ్ల దృష్టిలో మీది పెద్ద ఉద్యోగమే గదా!" అంది.

రామచంద్రం మరి మాట్లాడలేదు.

* * *

ఆదివారం సాయంకాలం. ఇళ్లల్లో టీవీ సినిమాలో గోల తప్ప రోడ్లన్నీ నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా ఉన్న వేళ వీధి అరుగు మీద కేన్ కుర్చీ వేసుక్కూర్చుని ఆకాశం వంక చూస్తున్నాడు రామచంద్రం.

"ఏవిఁటోయ్, రామచంద్రం! ఏవిఁటలా ఒక్కడివే కూర్చున్నావ్?' అంటూ వచ్చాడు రంగారావు.

"గోల లేకా, ఏం తోచకా" అన్నాడు రామచంద్రం.

"భలేవాడివే! మీ వాళ్లూ, మీ చుట్టాలూ కనిపించరేం?"

"గుళ్లో కెళ్లారులా ఉంది లెండి" అన్నాడు.

"శుభం. అయితే ఓ చిన్న ఉపకారం చేసిపెట్టాలోయ్!" అంటూ అక్కడున్న స్టూలు లాక్కుని కూర్చున్నాడు.

"ఏవిఁటో? వాళ్లు రాగానే ప్రసాదం తెచ్చివ్వమంటారా?"

"భలే జోకేస్తావోయ్! అది కాదు గానీ, నా కీ కీళ్ల నొప్పులు వదలటం లేదనుకో. మా హోమియో డాక్టరేమో ఊరికి ఆ కొసనీ, నే నీ కొసనీ."

రాబోయే ముప్పేదో సుమారుగా ఊహించగలిగాడు రామచంద్రం.

"అంత కష్టమైతే డాక్టర్ని మార్చేయరాదుటండీ?' అన్నాడు.

"అది కుదరదే. ఆయన నాకు చిన్నప్పటి నుంచి తెలిసిన డాక్టరాయె."

"మీ చిన్నప్పటి నుంచి ఆయనే డాక్టరా? మీకే అరవై అయిదేళ్లుంటాయి. మరి ఆయన కెన్నుంటాయో?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఎన్నో ఎందుకుంటాయీ - నా ఈడు వాడే. ఇద్దరం ఒకే బళ్లో కలిసి చదువుకున్నాం. నేనేమో చదువు సగంలో ఆపేసి ఎరువుల కంపెనీలో జేరి అక్కడే రిటైరై ఇలా కుంటుంబానికీ, దేశానికీ బరువై ఉన్నాను. అతగాడేమో ఆయుర్వేదం, హోమియోపతీ నేర్చుకుని హస్త వాసి గల డాక్టరుగా పేరు తెచ్చుకుని రిటైర్మెం టన్నది లేకుండా హాయిగా ఉన్నాడు. అంచేత, నీ మోపెడ్ ఓ మారు ఇచ్చావంటే అర గంటలో తెచ్చి ఇచ్చేస్తాను" అన్నాడు.

ఇవ్వ ననడానికి వెంటనే కారణం దొరకలేదు రామచంద్రానికి.

"సరే, తీసుకెళ్లండి. అర గంట దాటిందో నేనే ఏ బాటరీ లైటో వేసుకుని మీ కోసం బయలుదేరాల్సి ఉంటుంది మీ మనవలు వేసే ప్రశ్నలు భరించలేక."

"వాళ్ల మొహం! నాకు డ్రైవింగ్ సరిగా రాదనీ, దేనికైనా గుద్దించేస్తా ననీ వాళ్ల నమ్మకం. అరగంట ఎందుకూ? ఇరవై అయిదు నిమిషాల్లో నీ ముందుండనూ?" అంటూ తాళం చెవు లందుకుంటూ, "ఇంతకీ బండిలో పెట్రోలుంది గదా!" అనడిగాడు.

"ఉంది లెండి."

"ఏం లేదు, లేకపోతే పోయిద్దామని" అన్నాడు రంగారావు తాపీగా.

అటువంటి తెలివితేటలూ, మాటకారితనం రంగారావులో పుష్కలంగానే ఉన్నట్టు రామచంద్రం అంతకుముందే గ్రహించాడు.

"ఎందుకైనా మంచిది పోయించేయండి. తీరా చాలకపోతే మీరు ఇబ్బంది పడతారు!" అన్నాడు.

"ఎందుకూ? చాలకపోతేగా? సరిపోతుందనే అన్నావుగా. వస్తానోయ్ మరి!" అంటూ గుమ్మం దాటేశాడు రంగారావు.

ఇరవై నిమిషాలు దాటింది, అరగంటకూడా అయింది. రంగారావు మాత్రం అయిపు లేడు. రామచంద్రంలో సహనం నశించిపోతోతంది.

"అయ్యో రామా! లైటైనా వేసుకోకుండా చీకట్లోనే కూర్చున్నారా?" అంటూ వచ్చింది జానకి.

"బావగారు కరెంటు పొదుపు గానీ చేస్తున్నారేమో నక్కా!" అంది రాజ్యం నవ్వుతూ.

రామచంద్రానికి మండుకొచ్చింది. "మరేం. ఇవాళ పొదుపు చేస్తేనేగా రే ప్పొద్దున్న ఎవరి కోసమైనా ఖర్చుపెట్టగలం. డబ్బు లేకపోతే ఎవరూ చూడరు. చివరికి చుట్టాలు కూడా" అన్నాడు.

"ను వ్వెళ్లు, రాజ్యం! పిల్లాడు ఆకలి అంటున్నాడు. వాడికి అన్నం పెట్టేయ్! నేను కాసేపు కూర్చుని వస్తాను" అంటూ సర్ది చెప్పి, "ఇల్లు చీకటిగా ఉండీ, వీధి గుమ్మంలో మీ వాహనం కనిపించకపోతేనూ ఎక్కడికైనా వెళ్లారేమో అనుకున్నా సుమండీ!' అంది జానకి.

"వెళ్లిపోవలసినవాడినే. నా కా ఛాన్సు దక్కనీయలేదు ఆ ఎరువుల రంగారావు."

"ఏవిఁటీ! మళ్లీ ఆయనకి బండిచ్చేరా? పోయిన సారి ఆక్సిడెంటు చేసుకుని తీసుకొస్తే ఖర్చు తడిసి మోపెడైంది. మళ్లీ మరోమారు ఇవ్వనని ఒట్టేసుకున్నారుగా!"

"తెల్లా ర్లేచి ఆయన ఏదో ఒకటి అడుగుతూనే ఉంటాడు. ఎన్నని లేవని చెప్పడం? ఒట్లు తీసి గట్లమీద పెట్టేట్టు చేస్తాడు. ఇంతకీ ఆయన ప్రతి వస్తువూ ఎందుకు ఎరు వడుగుతాడో తెలుసా?"

"ఎందుకనీ?"

"ఆయనగారు ఎరువుల కంపెనీలో పని చేసి రిటైరయ్యాడుగా!"

"బాగానే ఉంది, ఎరువుల కంపెనీ అంటే వస్తువులు ఎరువు తెచ్చే కంపెనీ కాదు. ఫెర్టిలైజర్ కంపెనీ."

"ఆఁహా! నేను ఇదేనేమో అనుకున్నాను" అంటూ లేచాడు రామచంద్రం నవ్వుతూ.

* * *

రామచంద్రం ఇచ్చిన అయి దొందలూ పట్టుకుని ప్రయాణ మయ్యాడు సుందర్రావు.

"నేనూ నీతో వస్తా, నాన్నా!" అని వెంటబడ్డ కొడుకుని బుజ్జగించి, "నాలుగు రోజుల్లో వచ్చేస్తాను. మనమంతా కలిసి వెళ్లిపోదాం!" అంటూ వాడి చేతిలో ఓ రెండ్రూపాయల నోటుంచి రై లెక్కేశాడు.

అలా వెళ్లినవాడు నాల్రోజులు కాదు గదా, పది రోజులైనా తిరిగి రాలేదు.

ఆ రోజు రామచంద్రం ఆఫీసు కెళ్లడానికి మోపెడ్ తియ్యబోతూ అవాక్కయి నిల్చుండిపోయాడు. ఆ వెంటనే, "జానకీ!" అంటూ కేక పెట్టాడు.

"ఏమిటీ?" అంటూ వచ్చిన జానకికి మోపెడ్‌ని చూపించాడు.

"అమ్మో! నిక్షేపంలాంటి సీటు. ఎవరు కోసేశారూ?' ' అంటూ ఆశ్చర్యపోయింది.

"ఇంకెవరూ? మీ పిల్ల రాక్షసుడే. నిన్న నేను బయటకు వెళ్తున్నప్పుడు తీసుకెళ్లమని పేచీ పెట్టాడు గదా! తీసుకెళ్లలేదని నా వైపు ఎలా చూశాడో తెలుసా? వాడి చూపే రాక్షసి చూపు. అదేదో ఇంగ్లీషు సిన్మాలో చూపించినట్టు వాడు గట్టిగా చూస్తేనే వస్తువులు నాశన మయిపోతాయి!" అన్నాడు రామచంద్రం కోపంగా.

అంతవరకూ కిటికీలో కూర్చుని అలారం టైం పీస్‌లో గంట ఎక్కడుందో విప్పి చూసే ప్రయత్నంలో ఉన్న పిల్ల రాక్షసి, రామచంద్రం మాటలకు పిల్లిలా కిందికి దూకి లోపలికి పోయాడు.

'ఛ! ఊరుకోండి! మా రాజ్యం వింటే బాగోదు' అన్నదే కానీ, జానకికీ అనుమానంగానే ఉంది వాడే ఈ పని చేసుంటాడని.

"ఉదయం నా రేజర్ సెట్లోని బ్లేడు కనిపించకపోతేనే అనుకున్నాను. మనింట్లో ఎప్పుడైనా ఇలా జరిగిందా?" అంటూ వాచీ చూసుకుని, పులిని చూసినవాడిలా పరుగెత్తాడు మోపెడ్‌తో సహా - ఆఫీసుకు.

* * *

ఆ రాత్రే పప్పులూ, బియ్యమూ అయిపోయాయనీ, తెప్పించమనీ రామచంద్రానికి ఇండెంట్ పెట్టింది జానకి.

"అప్పుడే అయిపోవడ మేమిటీ?" రామచంద్రం ఆశ్చర్యపోయాడు.

జానకికి కోపం వచ్చింది. అది గ్రహించి, "అవునూ, సుందర్రావు వెళ్లి ఎన్నాళ్లయిం దంటావు?" టాపిక్ మారుస్తున్నట్టుగా అడిగాడు.

జానకికి అర్థమైంది. "ఏమో! ఇవాళే ఉత్తర మొచ్చింది రాజ్యానికి అతని దగ్గర నుంచి. వాళ్ల దూరపు బంధువు లెవరో పోయారట. అంచేత అతనికి మైలట. అది పోయాక వచ్చి తీసుకెళ్లే ఉద్దేశంలో ఉన్నాడట" అంది.

"పోయింది దూరపు బంధువు. మైల ఆయనకీ, ఖర్చు మనకీను!" అన్నాడు రామచంద్రం వెటకారంగా.

"ఖర్చంటే ఎలా? ఆ మాత్రం తల్లీ, తోడూ రాకుండా ఉంటారా?"

"రావచ్చు. రాకూడదనీ, రావద్దనీ ఎవరూ అనరు. అవకాశాన్నిబట్టి వారం రోజులో, పది రోజులో ఉండి వెళ్లొచ్చు. అంతే గానీ నెలల తరబడి కుటుంబాలతో వచ్చేసి, తెచ్చుకున్న డబ్బంతా జల్సాలు చేసేసి, తిన్న ఇంట్లోనే అప్పు చేసి మరీ అయిపు లేకుండా పోతేనే ఇబ్బంది. మన మంతా నెల జీతం మీద ఆధారపడి తినే వారమని మాత్రం మరిచిపోకూడదు."

"అయితే ఏవిఁ టంటారూ? అలా అని బంధుత్వాల్ని తెంపేసుకుంటారా?" కోపం పట్టలేక అడిగింది జానకి.

"బంధుత్వాన్ని డబ్బు ఇబ్బంది కారణంగా తెంపేసుకుంటే ఈ దేశంలో మూడొంతుల జనాభా ఏ బంధనాలూ లేకుండానే ఉండేవారు. నే చెప్పే దేమిటంటే చుట్టపు చూపుగా వచ్చినవాళ్ల అభిమానం, ఆప్యాయతల్ని ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉంటే అందరికీ బాగుంటుంది. మర్యాదలూ దక్కుతాయి. వచ్చిన వారి తిండి ఖర్చు మాట లెలా ఉన్నా వాళ్ల షికార్లు, ఖరీదైన అలవాట్లు కూడా భరించాలంటే కష్టమే మరి!"

రామచంద్రం మాటలకు జవా బివ్వలేదు జానకి. అటు తిరిగి పడుకుంది.

* * *

"ఏఁవోయ్, రామచంద్రం! ఇదిగో, ఏమి టలా అపరాధిలా తలొంచుకు మరీ వెళ్లిపోతున్నావ్?" రంగారావు కేకలకు ఆగి, వెనక్కి చూశాడు రామచంద్రం.

"ఆఫీసు నుంచేనా? నడిచొస్తున్నావ్, నీ బండేదీ?' అతడే అడిగాడు.

"మెకానిక్‌కి ఇచ్చానులెండి."

"ఏం రిపేరటా?"

"ఏదోలెండి, ఇంట్లో చుట్టాలబ్బాయి ఉన్నాడు గదా, ఏవో తుంటరి పనులు చేస్తుంటాడు." క్లుప్తంగానే జవాబిచ్చాడు రామచంద్రం.

"అబ్బ! ఆ కుర్రాడా? ను వ్వేం అనుకోకు గానీ, వాడు రాక్షసుడే! నిన్న మీ ఆవిడకి ఓ పెద్ద గండం గడిచింది గదా!"

రామచంద్రం ఆశ్చర్యంగా అతనివంక చూసి, "ఏం జరిగిందీ?" అన్నాడు.

"అయ్యో! మీ ఆవిడ చెప్పలేదా? నిన్న మధ్యాహ్నం టిఫిన్ చేద్దామనో, ఏమో మీ ఆవిడ మిక్సీలో ఏవో వేసి మిరపకాయల కోసమో, ఉప్పు కోసమో పక్కకు తిరిగిందట. ఇంతలో ఈ రాక్షసి వెధవ లేడూ, వాడు నెమ్మదిగా వెళ్లి మీ ఆవిడ అందులో చెయ్యి పెట్టేలోగా బటన్ నొక్కేశాడు. ఇంకేముందీ? ప్లగ్ అప్పటికే పెట్టేసి ఉందేమో మోటారు సర్ర్‌మని తిరిగి అందులో వేసిన వన్నీ మీ ఆవిడ ముఖంమీదికి తుళ్లేశాయి. ఒక్క క్షణం ఆలస్యమైతే వేళ్లు తెగిపోను. భయపడిందేమో, మీ ఆవిడ వణుకు తగ్గడానికి అర గంట పట్టింది. ఆ సమయంలో చదివేసిన పేపరు ఇచ్చేయడానికి వెళ్లి నే నక్కడే ఉన్నాను" అన్నాడు రంగారావు.

రామచంద్రానికి పిల్ల రాక్షసి మీద చెప్పలేనంత కోప మొచ్చింది. విషయం తనకి చెప్పనందుకూ, అటువంటి వారిని నెత్తిన పెట్టుకున్నందుకూ జానకి మీద కూడా అతని క్కోపం వచ్చింది.

"ఇంతకీ వాళ్లింకా ఎన్నాళ్లుంటా రంటావ్?" అడిగాడు రంగారావు.

"అది తెలిస్తే ఇక నేం? వచ్చి అప్పుడే నెల మీద పది రోజు లయింది. ఆయనగా రేమో ఆఫీసు పను లంటూ ఉడాయించాడు. అతగా డొచ్చి తీసుకెళ్లాలట. నాకు మాత్రం ఇదంతా ఓ నాటకంగా కనిపిస్తోంది" అన్నాడు.


"అవునా? నాటకమైతే, మనమూ ఓ నాటక మాడేయడమే. మొహమాట పడితే అప్పుల్లో కూరుకుపోతారయ్యా! అనుభవజ్ఞుడిని అడిగి తెలుసుకో మన్నారు. శ్రేయోభిలాషిని కాబట్టి అడక్కపోయినా చెబుతాను నువ్వు ఒప్పుకుంటే."

రామచంద్రం ఆశగా అతని వంక చూశాడు.

* * *

గురువారం సాయంకాలం రంగం సిద్ధమైంది.

"ఇదిగో, జానకీ! భిలాయ్ నుంచి ఉత్తర





**భలే కుటుంబం**

**బెం**గుళూర్‌కి దూరంగా ఉన్న లోబూరు అనే చిన్న గ్రామంలో 130 మంది కుటుంబ సభ్యులు గల ఉమ్మడి కుటుంబం ఉంది. ప్రతి రోజూ ఈ కుటుంబానికి యాభై లీటర్ల పాలు కావాలి. ఎనిమిది వందల రొట్టెలు చెయ్యాలి. అందరూ కలిసి మెలిసి వ్యవసాయం చేసుకుంటున్నారు.

- కృత్తిక

మొచ్చిందోయ్! పెద్దన్నయ్యా వాళ్లూ రే పాదివారం వస్తున్నారు" అన్నాడు రామచంద్రం ఆఫీసు నుంచి వచ్చి బట్టలు మార్చుకుంటూ.

"ఏవిఁటో విశేషం?" అంటూ వచ్చింది జానకి.

"రెండేళ్లలో రిటైరైపోతున్నాడుగా. లీవ్ ట్రావెల్ కన్సెషన్ మీద కన్యాకుమారి వరకూ వెళ్తున్నారు. దారే కదా అనీ ..."

"ఆదివారమంటే రేపొచ్చే ఆదివారమేనా, బావగారూ!" అడిగింది రాజ్యం.

"అవును. మేం కలుసుకుని పదేళ్లు దాటిపోయింది. కదూ, జానకీ!" అంటూ భార్య వంక తిరిగి, "మొదటిసారి మనింటికి వస్తున్నారు. ఎలాంటి మర్యాదలు చేస్తావో మరి!" అన్నాడు రామచంద్రం.

"నాకు చేతనైనంత మటుకు వండి పెడతాను. వాళ్ల అలవాట్లూ, పద్ధతులూ ఇంక మీరే చూసుకోవాలి' అంది జానకి.

"ఏముందీ, వాళ్లు మనలా రెండుపూటలా అన్నం తినరు. రాత్రులు రొట్టెలూ, పాలూ, పళ్లూ తీసుకుంటారు. ఉదయం పూట మామూలే. అయితే పళ్లూ, పాలూ వాళ్లే కొనుక్కుంటారు. అటువంటి వాటి విషయంలో మరొకరికి భారం కావడం మా అన్నయ్యకి ఇష్టం ఉండదు. ఇక వాళ్లున్న ఆ వారం రోజులపాటూ తిరగడానికి ఓ ఆటో కానీ, టాక్సీ కానీ వాళ్లే ఏర్పాటు చేసుకుంటారు."

"సరే లెండి, అన్నీ వాళ్లే చూసుకుంటే ఇంక మనం చేసే మర్యాద లేముంటాయి?"

"మనసుపడి చేసే మర్యాదలే ఉంటాయి! మన పెద్ద గది ఖాళీ చేసి వాళ్ల కోసం కేటాయిద్దాం. మా అన్నయ్యకి ఇల్లు నీటుగా, నిశ్శబ్దంగా ఉండాలి. ఈ ఇరవై నాలు గ్గంటల టీ.వీ. అంటే అసలు పడదు. అంచేత ఈ వారం రోజులూ దాన్ని బంద్ చెయ్యాలి.'

"బాగానే ఉంది, బంధువు లొస్తుంటే సరదా పడాలి కానీ, ఇలా భయపడేటట్లు చేస్తే ఎలా?" అంటూ జానకి వంటింట్లోకి నడిచింది.

రామచంద్రం అక్కడే ఉన్న రాజ్యం వంక తిరిగి, గొంతు తగ్గించి, "మా వాళ్లు వెళ్లేటప్పుడు సంతోషపెట్టడంలో ఘనులు. క్రితం సంవత్సరం వీళ్లు ఢిల్లీ లోని మా చిన్నన్నయ్యా వాళ్లింటికి వెళ్లి రెండ్రోజులున్నారట - వచ్చేటప్పుడు మా చిన్న వదినకి రెండు వేల రూపాయల చీర పెట్టారుట!" అన్నాడు.

రాజ్యం కళ్లు విప్పార్చి రామచంద్రం వంక చూసింది.

ఆ మర్నాడు ఉదయం లేస్తూనే అక్కర్లేని పాత న్యూస్ పేపర్లూ, పుస్తకాలూ ఓ కట్ట కట్టి పేపర్ల వాడొస్తే అమ్మేయమని భార్యకు పురమాయించాడు రామచంద్రం. సాయంకాలం ఆఫీసు నుండి వస్తూనే పెద్ద గది సర్ది ఎప్పుడో గానీ ఉపయోగపడని కొంత సామాను అట కెక్కించేశాడు.

"హమ్మయ్య! ఇన్నాళ్లకి మోక్షం కలిగింది. ఎవ్వరూ కలిసి రాక, ఒక్కదాన్నీ చేయలేక ఊరుకున్నాను" అంది జానకి నవ్వుతూ.

ఆ రాత్రి రామచంద్రం భోజనం చేసే సమయంలో జానకి అంది - "రాజ్యం రేపు వెళ్లిపోతా నంటోందండీ!'

"అప్పుడే! ఏమిటి తొందర?" అంటూ రాజ్యం వంక చూసి, "మీ ఆయన రావాలిగా, కొంపదీసి మా అన్నయ్య వాళ్లు వస్తే ఇల్లు చాలదని వెళ్తున్నావా?" అనడిగాడు.

"అదేం కాదు, నే నెలాగా వెళ్లాలనే అనుకుంటున్నాను. ఆయన మళ్లీ ఇంత దూరం బోలెడు చార్జీలు పోసుకుని రావాలి కదా!" అంది రాజ్యం.

"మరి నా అయి దొందల మాటేమిటి?" అనబోయి, "మరి నువ్వు ఒంటరిగా ప్రయాణం చేయగలవో, లేదో చూసుకో. నే నిక్కడ రై లెక్కిం చేస్తాను" అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు రామచంద్రం.

* * *

"ఏవిఁటోనండీ, నెల్లాళ్లుగా సందడి అలవాటైపోయి ఇల్లంతా నిశ్శబ్దంగా బోసిపోయినట్లుంది" అంది జానకి శనివారం సాయంకాలం.

"నెల్లా ళ్లేం కర్మ, నెలన్నర పైనే అయింది" అంటూ సవరించాడు రామచంద్రం.

"మీ కన్నీ వేళాకోళమే గానీ, ఎవరైనా వాళ్లకి లేక వస్తా రేమిటి చుట్టాలింటికి?" అంది ముఖమ్మీదికి సీరియస్‌నెస్‌ని తెచ్చిపెట్టుకుంటూ.

"లేక కాకపోయినా, కొన్ని లోట్లు భర్తీ చేసుకుందికి కూడా వస్తారని ఈ మధ్యే తెలిసింది" అన్నాడు రామచంద్రం విషయంలోకి లాగుతూ.

"ఏవిఁటి మీ రనేది?" రెట్టించింది జానకి.

రామచంద్రం బీరువా తెరిచి మడిచి ఉన్న కాగితాన్ని తెచ్చి జానకి చేతిలో పెట్టి, "ఇది చదువు" అన్నాడు.

అది సుందర్రావు రాజ్యానికి రాసిన ఉత్తరం తాలూకు జిరాక్సు కాపీ.

"ప్రియమైన రాజ్యానికి,

ఈ ఆదివారానికి ఇల్లు విడిచిపెట్టి నెల అవుతుంది. ఈ నెల కిరాణా సామాను తెచ్చుకోలేదు కాబట్టి, రేపు ఫస్టుకి జీతం అందాక పాత బాకీ తీర్చేస్తే, షాపువాడు మళ్లీ సరుకులు ఇస్తాడు. క్రితం నెల మా అత్తయ్య వాళ్లూ మనమీద దండెత్తడం కాదు గానీ, మన కీ నెల అజ్ఞాతవాసమే అయింది. మీ అక్కయ్యకు ఏం చెబుతావో మరి. వీలు చూసుకుని వచ్చేయ్!

నీ,

సుందరం."

"అంటే, వీళ్లు చుట్టపు చూపుగా కాకుండా, ఈ నెలా పదిహేను రోజులూ మనింట్లో గడిపేయడానికే వచ్చారంటారా?" ఆశ్చర్యపోతూ అంది జానకి.

"ఏమో మరి! ఉత్తరం మాత్రం నిజం. వారం రోజుల క్రితం అది నా పుస్తకాల గూట్లో పడుంది. బహుశ రాజ్యం కొడుకే పడేసి ఉంటాడు. అనుకోకుండా చదివినా ఒక నాటకం చూసినట్టే ఫీలయ్యాను. నీ క్కూడా చూపించడానికే జిరాక్సు కాపీ తీయించి వాళ్ల ఉత్తరం వాళ్ల బాగ్‌లో పడేశాను'నెమ్మదిగా చెప్పాడు రామచంద్రం.

"బొత్తిగా నమ్మలేకుండా ఉన్నాను సుమండీ! క్రితం నెల వాళ్ల చుట్టా లెవరో వచ్చి వాళ్లని ఇబ్బంది పెట్టారని ఈ నెల మనింటి కొచ్చేస్తారా?"

"ఆశ్చర్య మేం లేదు. రోజు లలా ఉన్నాయి. బంధువుల మధ్య వ్యాపారం సంబంధాలే గానీ, రక్త సంబంధాలు ఉండటంలేదు" అన్నాడు రామచంద్రం.

"ఇప్పుడు కూడా మీ అన్నయ్యా వాళ్లు వస్తున్నారనే బయల్దేరింది కానీ, లేకుంటే మరో వారమైనా ఉండేదే!' ' అంది జానకి.

"నేనూ అందుకే మీ వాళ్ల నాటకానికి నాటకీయంగానే తెర దించేశాను" అన్నాడు రామచంద్రం.

జానకికి లీలగా అర్థమైంది.

"అంటే ... మీ అన్నయ్యా వాళ్లూ రావటంలేదా?'

"అంతేగా మరి!" నవ్వేశాడు రామచంద్రం.

* * *

ఆదివారం ఉదయం తీరిగ్గా అరుగు మీద కూర్చుని జానకి, రామచంద్రం న్యూస్ పేపర్ని చెరి సగం పంచేసుకుని ఎడా పెడా చదివేస్తున్న సమయంలో "టెలిగ్రాం, సార్!" అంటూ టెలిగ్రాం ఇచ్చి, సంతకం తీసుకుని వెళ్లాడా మెసెంజరు.

చదివి, నిర్లిప్తంగా జానకి వంక చూశాడు రామచంద్రం. 'అబద్ధాలాడినా, హాని చేసే మాటలు మాట్లాడినా 'తథాస్తు దేవతలుంటార్రా వెధవా! అలా అనకూడదు' అంటూ చిన్నప్పుడు బామ్మ మొట్టికాయ వేయడం గుర్తొచ్చిం దతనికి.

"ఎక్కడ్నించండీ, టెలిగ్రామూ? ఏముం దందులో?" అడిగింది జానకి అనుమానంగానే.

"కలకత్తా నుంచి మా చిన్న మామయ్య కొడుకు అప్పారాజు సకుటుంబంగా వస్తున్నాడు. పనేదో ఉందిట."

గాలి తీసిన బెలూన్‌లా అయిపోయింది జానకి.